క్లుప్తంగా

రేషన్ డీలర్లపై 6ఏ కేసులు నమోదు

మద్దిపాడు: మండలంలోని గుండ్లపల్లిలో రేషన్ దుకాణంపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రవికృష్ణ దాడి చేశారు. తనిఖీల్లో ఐదు బస్తాల రేషన్ బియ్యం ఎక్కువగా ఉండటం గుర్తించి 6ఏ కేసు నమోదు చేసినట్లు సమాచారం. మండలంలో ఇటీవల కాలంలో టీడీపీకి సంబంధించిన నాయకులు కొందరు రేషన్ షాపులపై పడ్డారు. వారి పార్టీకి సంబంధించిన వ్యక్తులను నియమించేందు కోసం 6ఏ కేసులు నమోదు చేస్తున్నట్లు సమాచారం. అధికార పార్టీకి మద్దతు ఇవ్వడం లేదంటూ డీలర్లను మార్చేందుకు టీడీపీ నాయకులు డీలర్లపై 6ఏ కేసులు నమోదు చేయిస్తుండటం గమనార్హం.

బీసీల ఐక్యతకు కృషి చేయాలి

ఒంగోలు వన్‌టౌన్: బీసీలు ఐక్యంగా హక్కుల కోసం కృషి చేయాలని పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ అన్నారు. జై. కృష్ణ బీసీ సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న డాక్టర్ మొర్రి పిచ్చియ్య యాదవ్ సన్మాన కార్యక్రమాన్ని గురువారం రాత్రి ఒంగోలు అన్నవరప్పాడులోని ఓ రెస్టారెంట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా విద్యార్థులను సక్రమంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ద్రవిడ దేశం వ్యవస్థాపకులు కృష్ణారావు, పి. మురళీకృష్ణ, సురేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అమ్మవారి నగరోత్సవం

చీమకుర్తి: స్థానిక సాక్షి రామలింగేశ్వరస్వామి ఆలయంలో వెలసిన శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి నగరోత్సవం శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు గురుస్వామి సూది వెంకట్రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీనగర్‌లోని శ్రీకోదండ రామస్వామి ఆలయం నుంచి అమ్మ వారి ఆలయం వద్దకు 516 కలశాలతో ఊరేగింపుగా వస్తారని చెప్పారు. రాత్రి పూట నిర్వహించే నగరోత్సవంలో జ్యోతులను పట్టుకునేందుకు ఆసక్తి కలిగిన చిన్నారులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సు


కనపర్తి గ్రామసభకు హాజరైన అధికారులు

నాగులుప్పలపాడు: భూసమస్యలు పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని మండల ప్రత్యేకాధికారి బేబి రాణి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కనపర్తిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సును ప్రతిరైతు సద్వినియోగం చేసుకొని భూసమస్యలకు సంబంధించి దరఖాస్తులు ఇవ్వాలన్నారు. వాటిని వెంటనే రెవెన్యూ అధికారులు పరిష్కరిస్తారని తెలిపారు. 19 దరఖాస్తులు అందజేశారు. తహసీల్దార్ కె.ప్రవీణ్ కుమార్, ఆర్ఐ రమేష్, సర్వేయర్ రత్నాకర్, వీఆర్‌ఓలు భాగ్యరావు, ఏసయ్య, చంద్రమోహన్ పాల్గొన్నారు.

నగరం తలరోత

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఒంగోలు ఆర్టీసీ బస్టాండు
- చుట్టు పక్కల లాడ్జీలల్లో జోరుగా వ్యభిచారం
- రాత్రి సమయాల్లో విటులను ఆకర్షించే పనిలో మహిళలు
- బస్టాండులో హిజ్రాల రచ్చ, యువకులను రొంపిలోకి దించుతున్న వైనం
- లాడ్జీల్లో మైనర్ విద్యార్థినీ, విద్యార్థులు


ఒంగోలు బస్టాండ్ ఆవరణ

ఒంగోలు టౌన్:

జిల్లా కేంద్రమైన ఒంగోలు ఆర్టీసీ బస్టాండు పరిసరాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారాయి. రాత్రయితే చాలు వివిధ గ్రామాల నుంచి వచ్చిన కొందరు మహిళలు రోడ్డు మీదకు చేరుతున్నట్లు సమాచారం. దాంతో రాత్రి ప్రయాణాలు చేయాలంటే ఇతర మహిళలు ధైర్యం చేయలేకపోతున్నారు. తోడుగా మగవారు లేకుండా బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్టాండుకు ప్రతి రోజూ సుమారు 50 వేల మంది నుంచి 75 వేల మంది వరకు ప్రయాణాలు సాగిస్తుంటారు. కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, వైద్యశాలల్లో చికిత్స కోసం వచ్చే రోగులు, వారి సహాయకులు, వ్యాపార నిమిత్తం వచ్చే వారుంటారు. దీన్ని ఆసరాగా చేసుకొని పలువురు లాడ్జీల నిర్వాహకులు అసాంఘిక కార్యకలాపాలను లాభసాటి వ్యాపారంగా మార్చుకున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్టీసీ చుట్టూ ఉన్న పలు లాడ్జీలల్లో నిత్యం వ్యభిచారం జరుగుతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది.

బలహీనతలను సొమ్ము చేసుకుంటూ..



ఆర్టీసీ బస్టాండుకు వచ్చే అమాయకులను, యువతీ యువకులను బలహీనతలను ఆసరా చేసుకొని కొందరు లాడ్జీల నిర్వాహకులు వ్యభిచారాన్ని నిర్వహిస్తూ రెండు చేతులా సంపాదిస్తున్నారు. నగరంలోని అద్దంకి బస్టాండు సెంటర్ సమీపంలో గల ఒక లాడ్జి, ఆర్టీసీ బస్టాండు పక్క సందులో ఉన్న ఒక లాడ్జి, బస్టాండు వెనుక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న ఒక లాడ్జి, ఆర్టీసీ బస్టాండు ఎదురుగా చౌరస్తా సెంటర్లో ఉన్న లాడ్జీలల్లో ఎక్కువగా వ్యభిచారం జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. రాత్రయితే చాలు ఈ లాడ్జీల వద్ద కొందరు మహిళలు బహిరంగంగా నుంచొని విటులను ఆకర్షించేపనిలో ఉంటున్నారు. వ్యక్తిగత పనుల మీద నగరానికి వచ్చే వారిని, వైద్య చికిత్స కోసం ఆసుపత్రులకు వచ్చే రోగుల సహాయకులకు వల వేస్తున్నారు. ఒక్కో లాడ్జి వద్ద కనీసం నలుగురు మహిళలు చొప్పున ఉంటున్నారు.

ఆర్టీసీ బస్టాండ్ లోపల కూడా..



ఆర్టీసీ బస్టాండు చుట్టూ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుండడం ఒక ఎత్తయితే లోపల కూడా వ్యభిచారం జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆర్టీసీ లోపల కొంతమందికి టెండర్ల ద్వారా గదులను అద్దెకు ఇచ్చారు. ఇటీవల మంజూరైన ఒక దుకాణాన్ని బినామీ పేరుతో దక్కించుకున్న ఓ ఆర్టీసీ చిరుద్యోగి సరసాలు సాగిస్తున్నట్లు ఉద్యోగులు చెవులు కొరుక్కుంటున్నారు. అధికారులు దృష్టి సారిస్తే ఇంటి దొంగను పట్టుకోవడం పెద్ద పని కాదని చెబుతున్నారు. అంతేకాకుండా ఇతరులు కూడా ఆర్టీసీ బస్టాండులో కాపు కాసి విటులను బుట్టలో వేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రయాణికుల్లా నటిస్తూ బస్టాండులో తిష్టవేస్తున్న.. వారు అక్కడికక్కడే బేరాలు కుదుర్చుకొని పక్కనే ఉన్న లాడ్జీలకు తీసుకొని పోతున్నారు.

కాలేజీ విద్యార్థుల జల్సాలు



అలాగే జిల్లా కేంద్రమైన ఒంగోలులో పెద్ద సంఖ్యలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలున్నాయి. ఇక్కడ వేలాది మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో కొందరు పక్కదారి పట్టి జల్సాలకు అలవాటు పడిపోయారు. ప్రేమ పేరుతో అమ్మాయిలను తీసుకొని లాడ్జీలకు వస్తున్నారు. ఇంకొందరు విద్యార్థులు పుట్టినరోజు వేడుకల పేరుతో లాడ్జీలకు వస్తున్నట్లు తెలుస్తుంది. ఇలాంటి మైనర్ జంటలు పోలీసుల కంట పడినా వారి భవిష్యత్తు పాడైపోతుందని వదిలిపెడుతున్నట్లు తెలుస్తుంది. దీంతో మైనర్లు ఇంకా రెచ్చి పోతున్నారు.

పోలీసు చర్యలు లేవా..



ఆర్టీసీ బస్టాండు ఎదురు, చుట్టూ పక్కల ప్రాంతాల్లో నిత్యం సెక్యూరిటీ పోలీసులు ఉంటారు. సీసీ కెమెరాల నిఘా ఉంటుంది. అయినప్పటికీ బహిరంగంగా వ్యభిచారం జరుగుతుండడం గమనార్హం. ఒకవైపున ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా సహించేది లేదని పోలీసు ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నప్పటికీ మరోవైపు క్షేత్ర స్థాయి పోలీసులు మాత్రం నెలవారి మామూళ్లకు అలవాటు పడిపోయి వ్యభిచారం జరుగుతున్న పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వ్యభిచారంతో పాటు గంజాయి విక్రయాల సమాచారం కొందరు పోలీసులకు తెలిసినా తెలియనట్లు నటిస్తున్నారని చెప్పుకుంటున్నారు.

ఎన్నికలు సరే.. హామీలు?


పాదర్తి ఇరిగేషన్ చెరువు ఇదే..


పాదర్తి ఇరిగేషన్ చెరువు కింద సాగు చేస్తున్న వరి

- నేడు సాగునీటి సంఘాల ఎన్నికలు
- 5,794 మంది రైతులు ఓటు వినియోగించుకోనున్న వైనం
- అన్నదాత సుఖీ భవ ఎక్కడని రైతన్నల ఆగ్రహం
- విత్తనాలు.. ఎరువులకూ దిక్కులేదు
- అలంకార ప్రాయంగా ఆర్బీకేలు
- పంట బీమా చెల్లింపులు కూడా రైతుల నెత్తిపైనే..

కొత్తపట్నం: సాగునీటి సంఘాల ఎన్నికలకు అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేశారు. ఓటర్ల లిస్టులను తయారు చేసుకున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ, ఎన్ఎస్పీ కెనాల్ అధికారులు పకడ్బందీగా నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఇంత వరకు బాగానే ఉన్నా అసలు ఈ ఎన్నికలు ఎందుకని రైతన్నలు ప్రశ్నిస్తున్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఠంచనుగా రైతు భరోసా ఇచ్చారు. అప్పుడు కొంత పెట్టుబడికి వచ్చి నాలుగేళ్ల సజావుగా జరిగిపోయింది. చెప్పిన మాట ప్రకారం ప్రతి ఏడాది సాగు సమయంలో నగదును అకౌంట్‌లల్లో జమచేశారు. కానీ నేటి ప్రభుత్వం వచ్చి 5 నెలలు కావస్తున్నా అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఇస్తామన్న రూ.20 వేలల్లో ఒక్క పైసా విదిల్చలేదు. ఖరీఫ్ సీజన్ పోయి రబీ ప్రారంభమైనా లాభం లేకుండా పోయింది. ఇక ఆర్బీకేల్లో సేవలు సక్రమంగా అందడంలేదు. ఎరువులు, విత్తనాలు బయల మార్కెట్లో అధిక ధరలకు వెచ్చించి కొనాల్సి వస్తోంది. చివరకు ఫసల్ బీమా ప్రీమియం కూడా రైతులే చెల్లించుకోవాలని కూటమి ప్రభుత్వం సెలవిచ్చింది. ఈ నేపథ్యంలో జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికల ద్వారా కూటమి ప్రభుత్వం రైతుల ఆగ్రహం చూడక తప్పదనే వార్తలు వినిపిస్తున్నాయి. సాగునీటి సంఘాల ఎన్నికల్లో రైతులంతా కలిసికట్టుగా ఓటు ద్వారా తమ అభిప్రాయాన్ని తెలియజేస్తామని చెబుతున్నారు.

2015 తర్వాత మళ్లీ ఇప్పుడే..

కొత్తపట్నం మండలంలో ఇరిగేషన్ 2, ఎన్ఎస్పీ కెనాల్ 4 కుగాను ఎన్నికల కోసం ఈ నెల 5న నోటిఫికేషన్ విడుదల చేసింది. కొన్ని అనివార్యాల కారణాల వల్ల వాయిదా వేయగా తిరిగి శనివారం ఎన్నికలు నిర్వహించనున్నారు. అన్ని గ్రామాల్లో ఆయా ప్రభుత్వ స్కూల్స్, పంచాయతీ కార్యాలయాల్లో ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలో అల్లూరు-కొత్తపట్నం-2, పాదర్తి ఇరిగేషన్ చెరువులు.. అంటే మైనర్ చెరువుల కింద 1,473 మంది రైతులు ఉండగా 1,650 ఎకరాలు సాగుబడి చేస్తున్నారు. ఎన్ఎస్పీ కెనాల్ కింద 4,321 రైతులు ఉండగా 11,074 ఎకరాలు సాగుబడి చేస్తున్నారు. ఈ ఎన్నికలు 2015లో అప్పుడు టీడీపీ ప్రభుత్వంలో నిర్వహించారు. తిరిగి మరలా 2024లో నిర్వహిస్తున్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహిస్తాం: మధుసూదన్‌రావు: ఇరిగేషన్ ఏఈ

ఈ నెల 8 జరగబోయే సాగునీటి సంఘాల ఎన్నికలు పకడ్బందిగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశాం. చేతులు ఎత్తే పద్ధతి పెడతాము. అది కూడా సరిగా లేకపోతే స్లిప్‌ల ద్వారా ఓటింగ్ వేసే పద్ధతి నిర్వహిస్తాం. మైనర్ చెరువుల 2, మేజర్ 4 చెరువులకు.. 12,724 ఎకరాల్లో 5,794 మంది రైతుల ఓటును వినియోగించు కుంటారు. అధ్యక్షులు 6 గురు, డైరెక్టర్లు 60 మందిని ఎన్నుకోనున్నారు.

రైతు ధర్నాకు తరలి వెళ్లిన నాయకులు


ఒంగోలులోని ధర్నాలో చీమకుర్తి మండల నాయకులు

సంతనూతలపాడు: రైతు సంక్షేమం కోసం రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విధంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఒంగోలులో శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ రైతు ధర్నాకు ఆ పార్టీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి ఆధ్వర్యంలో సంతనూతలపాడు మండలం నుంచి భారీగా రైతులు, నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, సొసైటీ మాజీ అధ్యక్షుడు దుంపా యలమందారెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు ఎస్కే రహంతుల్లా, వైఎస్సార్ సీపీ నాయకులు కె.నాగాంజనేయులు, వల్లపు శీను, నలగట్ల రాజబాబు, ఆడకా వెంకట సుబ్బయ్య, ఆంజనేయులు, ఎస్కే ఖాదర్, రామాంజనేయులు తరలి వెళ్లారు.

చీమకుర్తి రూరల్: రైతులకు అండగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులో నిర్వహించిన ధర్నాకు చీమకుర్తి మండలం నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. ఒంగోలు ధర్నాకు ప్రకాశం జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు చీమకుర్తి మండల పార్టీ అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తరలి వెళ్లారు. ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్ పర్సన్ రాజ్యలక్ష్మి, చంద్ర, చీమకుర్తి పట్టణ అధ్యక్షుడు కిష్టపాటి శేఖర్‌రెడ్డి, బొడ్డు కోటేశ్వరరావు, రావి లక్ష్మయ్య, కత్తి రమణారెడ్డి, వసంతరావు, ధర్మారావు, ఆంజనేయులు, పొన్నపల్లి సుబ్బారావు, కౌన్సిలర్లు బెల్లం వెంకట్రావు, ఎ.ప్రమీల, రామబ్రహ్మం, సోమ శేషాద్రి, పాటిబండ్ల గంగయ్య, తప్పేట బాబూరావు, బాషా, ఎస్.విజయభాస్కరెడ్డి, ఉప్పలపాటి వెంకటరావు, పి. నాగేశ్వరరావు, రాజేంద్ర, మోహన్, చెంచయ్య, రాంబాబు, రాజు, సంతోష్, రోశయ్య, పేరయ్య, పులి శ్రీను, సుబ్బు, సాదినేని వెంకట్రావు పాల్గొన్నారు.


ధర్నాకు తరలి వెళ్తున్న సంతనూతలపాడు నాయకులు


సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తల నినాదాలు

నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి


తిమ్మసముద్రంలో పోలింగ్ బూత్ను పరిశీలిస్తున్న తహసీల్దార్


సమావేశమైన ఎంపీడీవో, తహసీల్దార్, ఏవో, ఎస్సై

మద్దిపాడు: మండలంలో నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సుజన్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో ఎంపీడీవో జ్యోతి, ఏవో కె.రమేష్‌బాబు, ఎస్సై శివరామయ్యతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇలపావులూరు, నేలటూరు, లింగంగుంట గ్రామాల్లో నీటి సంఘాల ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. ఒక్కో టీసీ నుంచి ఒక సభ్యుడిని ఎన్నిక చేసిన అనంతరం 12 మంది సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి వారిలో అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడిని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. నేలటూరులో ఎంపీయూపీ పాఠశాలలో, ఇలపావులూరు ఎంపీయూపీ పాఠశాలలో, దొడ్డవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, లింగంగుంట జిల్లా పరిషత్ పాఠశాలలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసు శాఖ తగిన చర్యలు తీసుకునే విధంగా తహసీల్దార్.. ఎస్ఐకి పలు సూచనలు చేశారు

నాగులుప్పలపాడు: మండలంలోని నీటి వినియోగదారుల సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. మండలంలోని తిమ్మసముద్రం, అమ్మనబ్రోలు, మట్టిగుంట, మాచవరం, రాపర్ల, కనపర్తి, ఎం.ముప్పాళ్ల గ్రామాల్లోని నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

సంతనూతలపాడు: నేటి నీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధమైనట్లు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి తెలిపారు. మండలంలో మొత్తం 180 టీసీలకు ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఎన్నికల నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఆదిలక్ష్మి వెల్లడించారు. ఆయా నీటి సంఘాల పరిధిలో 18,827 మంది ఓటర్లు ఉన్నారు. ఆయా కేంద్రాల పరిధిలో ఈవో, ఏఈఈ, పీఓ, ఏపీఓల పర్యవేక్షణలో ఎన్నికలు జరగనున్నాయి.

సబ్సిడీ రుణాలు ఇవ్వాలి

ఒంగోలు వన్‌టౌన్: బీసీలకు రూ. 1878 కోట్లు విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కూడా సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ఒంగోలులోని జిల్లా కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ ఒక కోటి 30 లక్షల మంది బీసీలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయడానికి నిధులు విడుదల చేశారన్నారు.

ఘనంగా హనుమత్ వ్రతాలు

ఒంగోలు మెట్రో: మార్గశిర మాసం శుక్రవారం హనుమత్ వ్రతం సందర్భంగా ప్రకాశం జిల్లావ్యాప్తంగా ఆంజనేయ స్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. స్థానిక కేశవస్వామి పేటలోని వీరాంజనేయ స్వామి దేవస్థానంలో, లాయర్ పేట చిట్టి ఆంజనేయ స్వామి మందిరం తదితర ఆలయాల్లో అష్టోత్తర శతనామాలు, ఆకు పూజ నిర్వహించారు.

బంగారం వ్యాపారులతో సీఐ సమావేశం


బంగారం వ్యాపారులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ శ్రీకాంత్

సంతనూతలపాడు: ఒంగోలు రూరల్ సర్కిల్ పరిధిలోని సంతనూతలపాడు మండల బంగారం వ్యాపారులతో ఒంగోలు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్. శ్రీకాంత్ బాబు శుక్రవారం సమావేశమయ్యారు. వ్యాపారులు తమ షాపుల్లో ఎక్కువ బంగారం నిల్వ ఉంచకుండా రాత్రికి ఇళ్లకు తీసుకెళ్లాలని సూచించారు. బంగారం కొనేందుకు, అమ్మేందుకు వచ్చిన కొత్త వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా అనుమానం వస్తే వ్యాపారులు వెంటనే సంబంధిత పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. నగలు దొంగతనం చేసి ఆ బంగారాన్ని అమ్మటానికి షాపుల వద్దకు వస్తుంటారని, అటువంటి వారు వచ్చినప్పుడు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. షాపుల చుట్టూ సీసీ కెమెరాలు పెట్టుకుని, షాపు దగ్గర రాత్రి సమయంలో సెక్యూరిటీ గార్డును నియమించుకుని తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

రెవెన్యూ సదస్సుకు 16 అర్జీలు


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ బ్రహ్మయ్య

చీమకుర్తి రూరల్: మండలంలోని పాటిమీదపాలెంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు 16 అర్జీలు వచ్చాయని మండల రెవెన్యూ అధికారి ఆర్. బ్రహ్మయ్య తెలిపారు. పట్టాదారు పాస్ పుస్తకాల కోసం, భూమి కొలతల కోసం అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు. గ్రామస్తులు వీఆర్వోలు రాజ్యలక్ష్మి, శ్రీను, వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిపాడు: మండలంలోని మల్లవరం వద్ద శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు 23 అర్జీలు వచ్చాయి. రీ సర్వేకు 12 అర్జీలు, పట్టాదారు పాస్ పుస్తకాల కోసం నాలుగు అర్జీలు, రేషన్ కార్డుల కోసం అర్జీలు వచ్చాయి. మల్లవరం వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు రెండు ఎకరాలు కేటాయించాలని శ్రీవారి వనం కమిటీ సభ్యులు అర్జీ ఇచ్చినట్లు తహసీల్దార్ సుజన్‌కుమార్ తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది, వీఆర్వో, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు


బాబా కీర్తనలు ఆలపిస్తున్న గాయకులు

భక్తిశ్రద్ధలతో బాబా కీర్తనలు

ఒంగోలు మెట్రో: దత్తజయంతి సందర్భంగా శుక్రవారం సీవీఎన్ రీడింగ్ రూమ్ ఆవరణలో షిరిడీ సాయిబాబా సత్సంగం భజన..సాయిబాబా కీర్తనలు నిర్వహించారు. శ్రీకృష్ణ దేవరాయ సేవా సమితి అధ్యక్షుడు మద్దుల నరసింహారావు భార్య వెంకట సుబ్బమ్మ అధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.